


రైతులను దగా చేస్తున్న ఎరువుల దుకాణాలు

- లింకు వ్యాపారంతో రైతు జేబుకు చిల్లు...
- రసీదులు లేకుండా అమ్మకాలు
- చోద్యం చూస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ పట్టణంలో ఎరువు దుకాణ యాజమాన్యాలు రైతులను దగా చేస్తున్నా వ్యవసాయ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. గత పది రోజులుగా పత్తికొండ మండలం ఎడతెరపి లేని వర్షం కురుస్తుంది. రోజు కురుస్తున్న వర్షాలకు పంటలు కాపాడుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. అధిక వర్షాల కారణంగా రైతులు పంట పొలాలకు ఎరువులను క్రిమిసంహారక మందులను వాడాల్సి వస్తుంది. ఇదే అదునుగా ఎరువు దుకాణ యాజమాన్యాలు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు.



లింకు వ్యాపారంతో రైతులకు తీవ్ర నష్టం

28-28-0, 14- 35- 14, 20-30-0- 18, 16- 28-26 , డిఎపి ఎరువులు కావాలంటే సిఎంఎస్ ఎరువులు కొనాల్సిందేనని రైతులను వ్యాపారస్తులు హుకుం జారీ చేస్తున్నారు. పత్తికొండ పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ ఫర్టిలైజర్ ఎరువుల దుకాణం యాజమాని రైతుకు డిఎపి కావాలంటే సిఎంఎస్ లింకు పెట్టడంతో దిక్కుతోచక రైతు కొనుగోలు చేశారు. పేరు ,ఊరు, చిరునామా లేకుండా రసీదులు కూడా ఇచ్చారని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల దుకాణాల యాజమాన్యాల లాభం కోసం రైతులను తీవ్రంగా నష్టాల ఊబిలోకి నెడుతున్నారు.

రసీదులు లేకుండా అమ్మకాలు...

ఎరువు దుకాణ యాజమాన్యాలు రైతు ఏదైనా కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రసీదు ఇవ్వాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా పత్తికొండ పట్టణంలోని ఎరువుల దుకాణంలో రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పిచికారి మందులకు ఎలాంటి రసీదులు ఇవ్వకుండా డబ్బులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన బిల్లు ఇవ్వకపోతే పంటలకు ఏమైనా నష్టం జరిగితే ఎవరిని అడగాలని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఉపయోగం లేని రైతు సేవా కేంద్రాలు...

గత వైసిపి ప్రభుత్వంలో రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఉద్దేశంతో ప్రతి గ్రామంలో రూ.20 లక్షలు వెచ్చించి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికింజరాపు అచ్చెన్నాయుడు రైతు భరోసా కేంద్రాన్ని పేరు మారుస్తూ రైతు సేవా కేంద్రంగా ఏర్పాటు చేశారు. రైతులకు కావాల్సిన ఎరువులు, పిచికారి మందులు దొరకడం లేదంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ మండలంలోని 17 రైతు సేవా కేంద్రాలు ఉన్నా ఉపయోగం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రానికి వ్యవసాయ అధికారులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియదు అంటూ రైతులు మండిపడుతున్నారు. వ్యవసాయ అధికారులు సూచనలు ,సలహాలు ఇవ్వడంలో పూర్తిగా విఫలం చెందారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నకిలీ బిల్లులు ఇస్తే చర్యలు తీసుకుంటాం..

- పత్తికొండ ఎఒ వెంకటరాముడు..



రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పిచికారి మందులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలి. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ అమ్మితే చర్యలు తీసుకుంటాం. ఏ రైతుకైనా అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేస్తే డీలర్ పై కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆర్ఎస్‌కెల ద్వారా ఎరువులు పంపిణీ చేయాలి

- రైతు రామచంద్ర, పులికొండ గ్రామం, పత్తికొండ మండలం.



ఏడు ఎకరాలలో పత్తి పంట సాగు చేయడానికి ఎరువులు పిచికారి మందులు పెట్టుబడి ఖర్చు ఎక్కువైంది. రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీ ఎరువులు, పిచికారి మందులను పంపిణీ చేయాలి. సుమారు నాలుగు లక్షలు వరకు ఖర్చు పెట్టాను. ప్రభుత్వాలు రైతులపై ప్రత్యేక దృష్టి పెట్టి సాగు ఖర్చు తగ్గే సూచనలు, సలహాలు ఇవ్వాలి.

శిథిలమైన హైవే సర్వీస్

రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

-కలెక్టర్‌కు పిపిఎస్ఎస్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని శిథిలమైన నేషనల్ హైవే సర్వీస్ రోడ్ల నిర్మాణానికి చర్యలు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. సోమవారం కలెక్టర్‌కు పట్టణ పౌర సంక్షేమ సంఘం(పిపిఎస్ఎస్) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఆ సంఘ ప్రతినిధులు ఇరిగినేని పుల్లారెడ్డి, కె.మధుసూదన్, జి.నారాయణ, పి మోహన్ రావు లు ఉన్నారు. ఈ సందర్భంగా ఇ పుల్లారెడ్డి మాట్లాడుతూ ఆటో నగర్, బళ్లారి చౌరస్తా మీదుగా రిజిస్ట్రేషన్ ఆఫీసు గుత్తి పెట్రోల్ బంక్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో సర్వీసు రోడ్డు శిథిలమై, వర్షం నీరు నిలచీ గుంతలు కనిపించక రోజు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారులకు ఇరువైపులా కాలువలు నిర్మించనందున వర్షం నీరు సర్వీసు రోడ్లపై ప్రవహిస్తున్నందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. నిబంధనల ప్రకారం సర్వీస్ రోడ్ల నిర్వహణ జరగడం లేదన్నారు. ఏళ్లు గడుస్తున్నా సర్వీస్ రోడ్ల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పుల్లారెడ్డి, నాయకులు

విద్యా రంగసమస్యలు పరిష్కరించాలి

-జాప్యం చేస్తే కలెక్టరేట్ ముట్టడి -ఆర్‌డిఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులకు పెండింగులో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ , స్కాలర్షిప్ విడుదల చేయాలని, జాప్యం చేస్తే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు జిల్లా నాయకులు అమర్ హెచ్చరించారు. సోమవారం కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్‌ను ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా నాయకులు అమర్, మాట్లాడుతూ డిగ్రీ, ఇంజనీరింగ్, బి-ఫార్మసీ వంటి ఉన్నత మైన విద్యలో పెండింగులో ఉన్న రియంబర్స్‌మెంట్ దాదాపుగా రూ.కోట్లల్లో పెండింగ్ లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు యువగళం పాదయాత్రలో నారాలోకేష్ పెండింగ్ బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. మరో పక్క కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు ఫీజులు కడితేనే పరీక్షలకు అనుమతిస్తున్నాయని పేర్కొన్నారు. పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హాస్టల్ విద్యార్థుల మెస్ కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈనెల 25న కలెక్టరేట్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మనోహర్, చిన్న, శంకర్, రాజు ,మహేష్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం బస్తీపాడు చిన్నటేకూరు, బొల్లవరం గ్రామాల్లో కర్నూలు ఎడిఎ సాలురెడ్డి, మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తెబ్బతిన్న పత్తి, ఉల్లి పంటలను పరిశీలించారు. పొలంలో మురుగు నీటిని తొలగించడంతో పాటు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు,1 లీటర్ నీటికి లేదా 10 గ్రాముల యూరియాను 1 లీటర్ నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలన్నారు. లేదా 13-0-45 ఒక కెజి ఎకరాకు పిచికారి చేసుకోవాలి. ఇటువంటి వాతావరణ పరిస్థితుల్లో వేరు కుళ్ళు , కాయ కుళ్ళ తెగులు ఎక్కువగా ఆశించిప పంటలకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటర్ కలుపుకొని పిచికారి చేసుకోవడం వల్ల వేరు కుళ్ళు తెగులు నివారించవచ్చున్నారు. కాయ కుళ్ళు నివారణకు ఒక లీటర్ నీటికి 100 ఎంఎల్ స్టెప్టో సైక్లీన్ మూడు గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి రెండు లేదా మూడు సార్లు పిచికారి చేసుకోవడం వల్ల నివారించవచ్చున్నారు. ఉల్లిలో అధిక నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. ఉల్లిలో కుళ్ళు తెగులు ఆశించిన్నపుడు కార్బండిజం మాంకోజెబ్ ఒక కేజీ ఎకరానికి పిచికారి చేయాలని, లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 500 గ్రాములు ఎకరానికి ఇసుకలో కలిపి చల్లుకొని నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో బస్తిపాడు బొల్లవరం చిన్నటేకూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ఉల్లి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

గడువులోపు పరిష్కరించకపోతే చర్యలు

- కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్చరిక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించక పోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ బాధితుల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని చెప్పినప్పటికీ ఆదోని మున్సిపల్ కమిషనర్ వద్ద ఐదు, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, కర్నూలు వద్ద రెండు, ఇన్‌స్పెక్టర్ వక్ఫ్ బోర్డు, కర్నూలువద్ద ఒకటి అర్జీ గడువు దాటినా పరిష్కరించలేదని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఆర్‌ఒను ఆదేశించారు. అర్జీల పరిష్కారంపై ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంటోందని, కొంతమంది అధికారులపై ప్రజల నుండి వ్యతిరేక స్పందన వచ్చిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ కు తగిన చర్యలు : దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అందుకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లాకలెక్టర్ ఆవిష్కరించారు.



బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కలెక్టరేట్ ఆధునీకరణ పనులు ప్రారంభం

కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఆర్అండ్‌బి శాఖ ద్వారా చేపట్టిన అధునీకరణ పనులు జాతీయ చిహ్నంసర్కిల్, ఫౌంటెన్‌తో కూడిన పార్కు, సువిధ కాంప్లెక్స్ లనుకలెక్టర్ పి.రంజిత్‌బాషా సోమవారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ సుందరీకరణలో భాగంగా ముఖభాగంలో జాతీయ చిహ్నంసర్కిల్, ఫౌంటేన్‌తో కూడిన పార్కులను నవీకరించామన్నారు. పార్కు పచ్చదనంతో, ఆహ్లాదంగా ఉండేలా రక రకాల అలంకరణ మొక్కలను నాటామని తెలిపారు. కలెక్టరేట్ కాంప్లెక్స్ సుందరంగా పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్‌ఒ వెంకటనారాయణమ్మ, ఆర్ అండ్ బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, పంచాయతీ రాజ్ ఎస్ఇ మద్దన్న,డిపిఒ భాస్కర్, కలెక్టరేట్ ఎఒ శివరాముడు , సువిధ శానిటేషన్ సంస్థ అధిపతి సంజయ్ కుమార్ సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్న నేపథంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. సోమవారం అధిక వర్షాలపై జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. తుంగభద్ర డ్యాం నుండి నేడు 90 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారన్నారు. మంగళవారం ఉదయానికి సుంకేసుల రిజర్వాయరుకు 1.20 లక్షల నుండి 2 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. నదీ తీర ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సుంకేసులకు 90 వేల క్యూసెక్కుల వరకు నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. భారీ వర్షాలు కురిసిన పక్షంలో 1.20 లక్షల నుండి 2 లక్షల క్యూసెక్కుల వరకు కూడా రావచ్చున్నారు. ప్రస్తుతం సుంకేసుల రిజర్వాయరు నుండి 76 వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదలుతున్నారని కలెక్టర్ తెలిపారు. అన్ని పాఠశాలలకు సెలవు కూడా ప్రకటిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



కలెక్టరేట్ ఆధునీకరణ పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్, జెసి, ఇతర అధికారులు



ముగింపు కార్యక్రమానికి హాజరయిన కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్

ముగిసిన ఫార్మకో విజిలెన్స్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని ఎ క్యాంపు మైపర్ ఫార్మసీ కళాశాలలో ఒక నెల రోజుల ఫార్మకో విజిలెన్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్ కర్నూలు మెడికల్ కాలేజీ, ఫార్మకాలజీ హెచ్ఒడి , ప్రొఫెసర్ డాక్టర్ పి.రాజేష్, ఫార్మకాలజీ డిపార్టుమెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ సతీష్ విద్యార్థులకు ఈ ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమం నిర్వహించి వారికి మైపర్ ఫార్మసి కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, డాక్టర్ రాజేష్ చేతులమీదుగా సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఈ ట్రైనింగ్ ఎంతో ఉపయోగపడుతుందని వారికి భవిష్యత్తులో ఫార్మకో విజిలెన్స్ ద్వారా ఉద్యోగ అవకాశాలు వస్తాయని డాక్టర్ రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్, అకాడమిక్ డీన్ రాజ్‌కుమార్, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతన సిబ్బంది పాల్గొన్నారు.



ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న విసి, తదితరులు

క్లస్టర్ వర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ గా శ్రీనివాస్

పలువురి అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా డాక్టర్ జి.శ్రీనివాస్‌ను నియమిస్తూ వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులను నిర్వహిస్తున్నారు. ఇక్కడ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పదవి కాలం ముగియడంతో యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా బాధ్యతలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయనను వైస్ ఛాన్సలర్ వెంకట బస్వరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయకుమార్, ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి, క్లస్టర్ యూనివర్సిటీ డీన్‌లు అక్తర్‌భాను, నాగరాజ్ శెట్టి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బాలసుబ్రమణ్యం లు ఘనంగా సత్కరించారు.

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించండి

- ఎస్‌పి విక్రాంత్ పాటిల్

-83 ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. కర్నూలు ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో ఎస్‌పి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 83 ఫిర్యాదులు వచ్చాయి.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

ప్రభుత్వ పాఠశాలలలో ఫిజికల్ ట్రైనర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి విజయవాడకు చెందిన ఎంట్రపల్లి శివ , కోయిల కుంట్లకు చెందిన మధ్యవర్తి రామకృష్ణ కలిసి నకిలీ ఉద్యోగాలు ఇచ్చి, ఏలూరులో ట్రైనింగ్ ఇచ్చి, ఆలూరు లో 6 నెలల పాటు పని చేయించుకుని మొత్తం ఐదుగురి నుండి ఒక్కొక్కరి నుండి రూ. 2 లక్షల నుండి రూ.4 లక్షల వరకు డబ్బులు తీసుకొని మోసం చేశారని పత్తికొండ మండలం, పులికొండ గ్రామానికి చెందిన రాజశేఖర్, నరేష్, లింగరాజు, పీటర్‌పాల్ , చైతన్యలు ఫిర్యాదు చేశారు. కుమారుడిని, కోడలు , కోడలు బంధువులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు గణేష్‌నగర్‌కు చెందిన అజ్మత్ ఖాన్ ఫిర్యాదు చేశారు. ఆదోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి దేవదానం, జ్యోతి అనే వ్యక్తులు రూ.5 లక్షలు తీసుకొని మోసం చేశారని కౌతాళం మండలం, చిరుతపల్లి గ్రామానికి చెందిన రాజు, మునిస్వామి ఫిర్యాదు చేశారు.



బాధితుల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

కోడలు, కొడుకు మమ్మల్ని కొట్టిపొదుపులో వచ్చిన డబ్బులు, బంగారం తీసుకెళ్లారని తుగ్గలి మండలం, గుండాల్ తండాకు చెందిన దానమ్మ, రాముడు నాయక్ దంపతులు ఫిర్యాదు చేశారు. నాకు ముగ్గురు పిల్లలు. మా సొంత తమ్ముడు శివరాజ్ మద్యానికి బానిసై, తల్లిదండ్రులు ఇచ్చిన నా ఆస్తి భాగాన్ని నాకు తెలియకుండా వేరే వాళ్ళకు అమ్మినాడని న్యాయం చేయాలని ఆదోని, స్వామిరెడ్డినగర్‌కు చెందిన తిరుపాలు ఫిర్యాదు చేశారు. బాబు అనే వ్యక్తి నా అంగడి ముందు కూరగాయల బండి పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని న్యాయం చేయాలని కర్నూలు, చౌక్ మసీదుకు చెందిన నజీర్ అహమ్మద్ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా, సిఐలు పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

-కలెక్టరేట్ ఎదుట బిఎస్‌పి ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ , రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ,విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో కల్పించాలని కర్నూలు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ , మరియు జిల్లా ఇన్చార్జీలు వనమన్న, గాడి అరుణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు సామేలు జిల్లా ఉపాధ్యక్షులు బోయ రవికుమార్, ప్రధాన కార్యదర్శి రామలింగయ్య సలహాదారులు సుంకన్న, శాంతిరాజు, నియోజకవర్గాల నాయకులు బంగారప్ప, ఫయాజ్, మధుకర్, కర్నూలు సిటీ కన్వీనర్ సాదిక్ పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గాలు స్వాతంత్రం తరువాత భారతదేశంలో వెనుకబడి పోవడాన్ని గమనించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 340 ప్రకారం 1953లో కాకకళ్యాణ్ కర్క మిషన్ 1978లో మండల కమిషన్లు వేయడం ద్వారా వారి స్థితిగతులను అప్పటి ప్రభుత్వాల ముందు నివేదిక రూపంలో ఉంచారన్నారు. అప్పటి ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఆ కమిటీలు అమలుకు నోచుకోకుండా ఉన్నాయని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ , బిజెపి పార్టీలు నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణమని వారన్నారు. 1991లో మాన్యశ్రీ కాన్సి రామ్ ఢిల్లీ బోర్డ్ క్లబ్‌లో బీసీల కోసం నిర్వహించిన 40 రోజుల సుదీర్ఘ ధర్నా కార్యక్రమంలో మండల కమిషన్ అమలు చేయండి లేదా కుర్చీ ఖాళీ చేయండి అనే నినాదంతో పోరాడారన్నారు. బిజెపి, కాంగ్రెస్ యేతర ప్రభుత్వమైన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం విపిసింగ్ నాయకత్వంలో మండల కమిషన్‌ను అమలు చేసిందన్నారు. దాంట్లో కూడా 27శాతం మాత్రమే రిజర్వేషన్లు బీసీలకు ఇచ్చారన్నారు. దీన్ని 50శాతం పెంచాలని మాయావతి నాయకత్వంలో బీసీ కులగనన నైతేనేమి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పెంచాలన్న డిమాండ్తో దేశవ్యాప్తంగా ఈరోజు పిలుపునిచ్చారన్నారు. ధర్నా అనంతరం డిఆర్‌ఒకు వినతి పత్రం సమర్పించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బిఎస్‌పి నాయకులు

పోస్టల్ శాఖలో ఫిలార్ టెలీ స్కాలర్షిప్ పరీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యార్థులకు పోస్టల్ స్టాంపు సేకరణ పై అవగాహన కల్పించడానికి ఎన్నో రకాల కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా 2025- 26 విద్యా సంవత్సరాల దీన్‌దయాల్ స్పర్శ యోజన అనే స్కాలర్షిప్ పరీక్ష సెప్టెంబర్ నెలలో ఉంటుందని డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి .జనార్దన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం విద్యా సంవత్సరంలో ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు చదివే విద్యార్థులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. వారికి గడిచిన విద్యా సంవత్సరంలో 2024-25లో 60 శాతం ఉత్తీర్ణత ఉండాలని, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు మార్కుల్లో 50 శాతం రాయితీ ఉంటుందని, ఈ పరీక్ష రెండు విభాగాలుగా జరుగుతుందన్నారు. రెండు విభాగాలలో ఉత్తీర్ణత పొంది విజయం సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.6000 స్కాలర్షిప్ అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వ్యక్తిగతంగా కానీ తమ స్కూల్ ప్రిన్సిపల్ ద్వారా కానీ ఫిలార్ టెలి డిపాజిట్ ఖాతా రూ.200లతో కర్నూలు ప్రధాన తపాలా కార్యాలయంలో తెరిచి ఆ వివ రాలను అప్లికేషన్ జతపరచి ఒక కవర్లో సూపర్డెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ కర్నూలు డివిజన్, కర్నూలు 5001 అడ్రస్‌కు పంపాలన్నారు. అప్లికేషన్ పంప డానికి చివరి తేదీ 2025 సెప్టెంబర్ 16 వరకు పంపాలన్నారు. ఇతర వివరాలకు కర్నూలుసూపరిన్‌టెన్‌డెంట్‌కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

22లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు ఈ నెల 22 లోగా దరఖాస్తులను సంబంధిత డిప్యూటీ డిఇఒ కార్యాలయాల్లో అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25లోగా కమిటీ ద్వారా ఎంపిక చేసినఉపాధ్యాయుల వివరాలను జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు.



నేతాజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్

నేతాజీకి ఘనంగా నివాళులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ వర్ధంతి సోమవారం నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ కళాశాల అధ్యాపకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమం లో కళాశాల లెక్చరర్స్ రామకృష్ణ, విజయశేఖర్ , జబీన్‌అక్తర్, ఉల్గోజిరావు, పార్థసారథి పటేల్, లక్ష్మి, సుజాత, చిన్న మల్లేశ్వరుడు , విద్యార్థులు పాల్గొన్నారు.



సూచన చేస్తున్న వెంకటేష్ చౌదరి

తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందిద్దాం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించే ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో రాజకీయ పార్టీల నాయకులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గం ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రం హేతుబద్ధీకరణ, నూతన ఓటరు నమోదు ఫారం 6, 7, 8 గురించి ప్రజలకు తెలియజేస్తున్నామని అన్నారు. అభ్యంతరాలుంటే నిర్ణయంగా చెప్పాలని సూచించారు. చనిపోయిన వారి వివరాలు ఇంకా జాబితాలో ఉన్నాయని, తొలగించేలా వద్ద తీసుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి తెలిపారు. నివాసాలు ఒకచోట.. ఓటర్ల జాబితాలో పేర్లు మరోచోట ఉన్నాయని, డోర్ నెంబర్ల వారీగా ఓటరు వివరాలు ఉండేలా చూడాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. తహశీల్దార్ రమేష్, ఎన్నికల ఉప తహశీల్దార్ గాయత్రి, రాజకీయ పార్టీల నాయకులు కునిగిరి నీలకంఠ, దేవిశెట్టి ప్రకాష్, ఈరన్న ఉన్నారు.

అవార్డు అందుకున్న డిటికి సన్మానం

ప్రజాశక్తి - ఆస్పరి



డిప్యూటీ తహశీల్దార్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఉత్తమ అవార్డు అందుకున్న డిప్యూటీ తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డికి టిడిపి నాయకులు మధు, మాజీ ఎంపిటిసి శివకుమార్ శాలువా, పూలమాలలతో సోమవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రామేశ్వర్ రెడ్డికి ఉత్తమ అవార్డు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యాలయానికి పని నిమిత్తం వచ్చే ప్రజలకు, రైతులకు మరిన్ని సేవలందించి వారి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, సీనియర్ అసిస్టెంట్ రంగస్వామి, ఎఎస్ఒ రామాంజనేయులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్

ప్రజాశక్తి- దేవనకొండ



దేవనకొండలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మండలంలో గత 15 రోజుల నుంచి కురుస్తున్న అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు అశోక్, యూసుఫ్, మహబూబ్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని తెర్నేకల్, పాలకుర్తి గ్రామాల శివారులోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆముదం, పత్తి, వేరుశనగ, టమోటా వంటి పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను సంబంధిత శాఖ అధికారులు పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని కోరారు. అనంతరం ఎఒ ఉషారాణికి వినతిపత్రం అందించారు. సిపిఎం నాయకులు పాండురంగడు, విటి.దొడ్డప్ప పాల్గొన్నారు. **ఆస్పరి** తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, మండల కార్యదర్శి వర్గసభ్యులు రంగస్వామి, రామాంజనేయులు మాట్లాడుతూ... మండలంలోని 33 గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు నీటి మునిగి పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పరిని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు మధు రెడ్డి, ఈరన్న, వెంకట రాముడు, షేక్షావలీ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో విత్తనం వేసుకున్న ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ-క్రాప్ యాప్‌లో పంట నమోదు చేయించుకోవాలని ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం చిప్పగిరి రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా రైతు సేవా కేంద్రాల్లో ఉన్న రైతులకు ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పించాలని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సూచించారు. ప్రభుత్వం ఏదైనా నష్టపరిహారం అందించే సమయంలో రైతుల పేర్లు లేకపోతే ఫిర్యాదులు చేస్తారని, ఆ సమస్య తెచ్చుకోకూడదని, ముందుగానే ప్రతి రైతుకూ సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎఇఒ రమాదేవి పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వామ్యమవుతాం

- ఎమ్మెల్సీ బీటీ.నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

రెండో ముంబయిగా పేరొందిన ఆదోని అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతానని ఎమ్మెల్సీ బీటీ.నాయుడు తెలిపారు. సోమవారం ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీ బీటీ ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఎమ్మెల్యే పార్థసారథి హాజరయ్యారు. ముందుగా ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీ బీటీ.నాయుడుతో మున్సిపల్ కమిషనర్ కృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాట్లాడుతూ... పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్రంలో రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికై, ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా బీటీ.నాయుడు నియామకం కావడం పట్టణాభివృద్ధికి తోడ్పాటునిస్తుందని తెలిపారు. వైసిపి కౌన్సిలర్లు ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని పట్టణాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని హితవు పలికారు. కౌన్సిల్ జరగక ముందుగానే సమావేశమై ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చించి, తీర్మానం జరిగేలా శ్రద్ధ చూపాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణకు సూచించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ... కూటమి ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ ఇద్దరం కలిసి ఆదోని నియోజకవర్గం, పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు పాటుపడతామని తెలిపారు. ఎమ్మెల్సీ బీటీ మాట్లాడుతూ... పుట్టి పెరిగి చదువుకున్న ఊరిని అభివృద్ధి చేసేందుకు పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అవకాశం ఇచ్చారని తెలిపారు. గతంలో ఆదోనిని రెండో ముంబయిగా పిలిచేవారని, మళ్లీ ఆదోనిని రెండో ముంబయిగా పిలిచేలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఆదోని పాత ఓవర్ బ్రిడ్జితో పాటు నీటి సమస్య తలెత్తకుండా బసాపురం ఎస్ఎస్ ట్యాంకు, రోడ్లు, డ్రెయినేజీ పనుల కోసం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు సలహాలతో ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీగా పట్టణాభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలు గజమాలతో బీటీ.నాయుడును సన్మానించారు. కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి, తుంగభద్ర దిగువ కాలువ నీటి సంఘం జిల్లా ఛైర్మన్ టిప్పు సుల్తాన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, ఉమాపతి నాయుడు, బసాపురం రామస్వామి, సాయిబాబా, సౌదీ రావుఫ్, రామచంద్ర, భూపాల్ చౌదరి, బత్తిని కుబేర్‌నాథ్, శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం, మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి, తిమ్మప్ప, ఆలూరు నియోజకవర్గ నాయకులు వీరభద్ర గౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, బిజెపి నాయకులు విట్టా రమేష్, వ్యాపారవేత్తలు సోమశేఖర్ రెడ్డి, ప్రతాప్ స్వామి, సామాజిక వేత్త కట్ట స్వామి దాస్ పాల్గొన్నారు.

వైసిపి కౌన్సిలర్లు డుమ్మా : అధికారికంగా మున్సిపల్ కౌన్సిల్‌లో జరిగిన ప్రమాణ స్వీకారానికి వైసిపి కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు ఎవరూ హాజరు కాలేదు.



బీటీ, పార్థసారథి, మీనాక్షినాయుడును గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

వైభవంగా ఈరన్న స్వామి పల్లకి మహోత్సవం

ప్రజాశక్తి - కౌతాళం



కౌతాళం : పల్లకి మహోత్సవంలో డిప్యూటీ కమిషనర్ వాణి, నాయకులు

శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకి మహోత్సవం వైభవంగా సాగింది. శ్రావణమాసోత్సవాల్లో భాగంగా చివరి సోమవారం దేవాలయ డిప్యూటీ కమిషనర్ వాణి, దేవాలయ అధికారులు పల్లకి మహోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున ఉరుకుంద ఈరన్న స్వామికి కందుకూరు సమీపంలోని తుంగభద్ర నదిలో జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కందుకూరు నుంచి తిప్పాలదొడ్డి, కరణి, మల్లనహట్టి, చిరుతపల్లి గ్రామాల నుంచి ఉరుకుంద గ్రామానికి పల్లకి చేరుకుంది. ఈ గ్రామాల నుంచి పల్లకి ఊరేగింపుగా వెళ్లడంతో పూజలు నిర్వహించి పండగ చేసుకున్నారు. ఉరుకుంద గ్రామ పొలిమేరకు స్వామివారి పల్లకి చేరుకోగానే మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, బాణసంచా కాల్చుతూ వైభవంగా స్వాగతం పలికారు. వేల మంది భక్తులు పూజలు చేసి దర్శించుకున్నారు. పల్లకి మహోత్సవం సందర్భంగా ప్రత్యేక విద్యుత్ అలంకరణ ఆకట్టుకుంది. దేవాలయ అధికారులు, అర్చకులు, గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో వేద మంత్రాలతో, ప్రత్యేక పూజలతో పల్లకి నుంచి స్వామివారిని దేవాలయంలోకి తీసుకెళ్లారు. సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కోసిగి : మండలంలోని కందుకూరు గ్రామంలో ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా తిరుగుతూ గ్రామం మీదుగా తుంగభద్ర నదీతీరంలో సోమవారం స్వామివారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో చక్రస్నానం చేశారు. శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ఉరుకుంద దేవాలయం నుంచి ఆయా గ్రామాల మీదుగా తుంగభద్ర నదిలో స్వామి వారి మూల విరాట్, చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేసి నదీజలాలతో చక్రస్నానం చేశారు. కర్ణాటక, తెలంగాణ నుంచి వేలాదిమంది భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. టిడిపి నాయకులు, మంచాల సొసైటీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ముత్తు రెడ్డి, రామిరెడ్డి, కురువ అయ్యన్న, రామిరెడ్డి, రామలింగ, వైసిపి కందుకూరు గ్రామ నాయకులు బెట్టన్న గౌడ్, జడ్‌పిటిసి పవిత్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పల్లకోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రీడా పోటీలు : పల్లకోత్సవం సందర్భంగా గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఆయా పార్టీల నాయకుల ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను చూసేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. 175 కిలోల గుండును ఎత్తి కర్ణాటక రాష్ట్రానికి చెందిన కప్పగల్ కరణ మొదటి స్థానంలో నిలిచారు. ఈయనకు రూ.5,100 బహుమతి వైసిపి జిల్లా కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి అందజేశారు. శారదల్లి సక్కీరప్ప రెండో స్థానంలో నిలవగా రూ.5 వేల నగదును వైసిపి మండల కన్వీనర్ బెట్టన్న గౌడ్ అందజేశారు. పరుగు పందెం పోటీల్లో పెద్ద తుంబళం ఈరన్నకు మొదటి బహుమతి రూ.4,100, రెండో బహుమతి పెద్ద తుంబళం తిమ్మప్పకు రూ.2,600 నగదును కమిటీ సభ్యులు అందజేశారు. 220 కిలోల ఇసుక సంచి ఎత్తే పోటీల్లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన మడినాళ యల్లాలింగ మొదటి స్థానంలో నిలవగా రూ.7,100 నగదును టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్రారెడ్డి అందజేశారు. రెండో స్థానంలో శారదల్లి వాల్మీకి మరియప్ప నిలవగా రూ.4,100 నగదును కోసిగి మాజీ సర్పంచి, టిడిపి నాయకులు ముత్తురెడ్డి అందజేశారు. మూడు జంపులు ఎగిరే పోటీల్లో మొదటి బహుమతి రూ.1,500, రెండో బహుమతి రూ.వెయ్యి నగదును కమిటీ సభ్యులు అందజేశారు. టిడిపి నాయకులు అయ్యన్న, రామిరెడ్డి, రామలింగ పాల్గొన్నారు.



కోసిగి : స్వామివారిని దర్శించుకుంటున్న నాయకులు

మోసపూరిత రాజకీయాలు తగవు : వైసిపి

ప్రజాశక్తి - మంత్రాలయం

యూరియా బస్తాలను ఇప్పిస్తామనే నెపంతో మాధవరం గ్రామానికి తీసుకెళ్లి టిడిపి కండువాలు కప్పి మోసపూరిత రాజకీయాలు చేశారని గజ్జెల గుర్రం నాగరాజు, ఉప్పలప్ప, బుడ్డన్న కుటుంబాల వారు తెలిపారని, ఇలాంటి మోసపూరిత రాజకీయాలు టిడిపి నాయకులకు తగదని వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి హితవు పలికారు. సోమవారం మండలంలోని వగరూరు గ్రామంలో తనను కలిసి పార్టీ ఫిరాయింపు గురించి ప్రస్తావించినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... ఈనెల 13న టిడిపి ఇన్‌ఛార్జీ సమక్షంలో వగరూరు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరినట్లు సోషల్ మీడియాలో హల్‌చల్ అయిందని తెలిపారు. మాధవరం గ్రామంలో యూరియా ఇప్పిస్తామని, టిడిపి వగరూరు గ్రామ నాయకులు మాయమాటలు చెప్పి కొంతమంది రైతులతో పాటు తమను తీసుకెళ్లి కండువా కప్పి టిడిపిలో చేరారని ప్రచారం చేశారని విమర్శించారు.

కనుల పండువగా రథోత్సవం

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని మొలగవల్లి గ్రామంలో వెలసిన నాగనాథలింగేశ్వర స్వామి రథోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. ఉదయం స్వామి వారికి గోపూజ, రుద్రాభిషేకం, బిల్వపూజ, కుంకుమార్చన, అగ్నిహోమం తదితర కార్యక్రమాలు అర్చకులు వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం స్వామివారి మూల విరాట్‌ను దేవాలయం నుంచి గ్రామ బొడ్రాయి వరకు ఊరేగించారు. స్వామివారి ముందు నంది కోళ్ల నాట్యం భక్తులను ఆకట్టుకుంది.

ప్రభుత్వాస్పత్రిలో మంచి సేవలు

- ఒటి పరికరాల భద్రత కోసమే గదికి తాళం

- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రజలకు మంచి వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో హెచ్‌డిబి కమిటీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో ప్రస్తుతం ఒటి ఓల్డ్ బ్లాక్‌లోనే కొనసాగుతోంద ని, కొత్త బ్లాక్‌లో ఉన్న పరికరాల భద్రత కోసం సిబ్బంది గదికి తాళం వేశారని తెలిపారు. ఆస్పత్రికి తాళం వేశారని దీనిపై కొందరు తప్పుడు ప్రకటనలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఆది, సోమవారం ఆస్పత్రిలో 7 డెలివరిలు, ముగ్గురికి ఎంఎల్‌సి, ఒపి 79 మందికి సేవలందించారని, ఒక పోస్టుమార్టం కూడా చేశారని వివరించారు. తప్పుడు ప్రకటన ద్వారా ఆస్పత్రి ప్రతిష్ట దెబ్బ తింటుందని, వాస్తవాలు తెలుసుకొని చూపించాలని హితవు పలికారు. గత కాంట్రాక్టర్ ఆస్పత్రిలో ఒపి గది కట్టకుండా నిర్మాణం చేసి వెళ్లిపోయారని, కూటమి ప్రభుత్వం వచ్చాక తాను ఒపి గది ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇక్కడకు ఫిజీషియన్ వైద్యులను కూడా అందు బాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. డెలివరీలో ఎమ్మిగనూరు ఆస్పత్రి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. క్రిటికల్ కేర్ యూనిట్ కోసం కేంద్రానికి ప్రతిపాదన పంపినట్లు చెప్పారు. సూపరింటెండెంట్ సుధా, వైద్యులు మల్లికార్జున పాల్గొన్నారు.

యువత వ్యాపారం వైపు దృష్టి సారించాలి

యువత వ్యాపారం వైపు దృష్టి సారించాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ వైడబ్ల్యుసిఎస్ గ్రౌండ్ ఎదురుగా మదర్ మిల్క్ డైరీని ప్రారంభించారు. మదర్ మిల్క్ డైరీ నిర్వాహకులు ఈ.హనుమంతు, ఈ.మల్లికార్జున, టిడిపి నందవరం మండల కన్వీనర్ ఖాసీంవలీ, ధర్మపురం గోపాల్ పాల్గొన్నారు.



వైద్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బీవీ



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

వర్షపు నీరు నిలువకుండా చూసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలో కురుస్తున్న వర్షాలతో పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎఒ ఉషారాణి సూచించారు. సోమవారం దేవనకొండ గ్రామ శివారులోని వర్షాలతో దెబ్బతిన్న పత్తి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వర్షపు నీరు నిల్వ ఉంటే మొక్కల వేర్లు కుళ్లిపోయి పంటకు పోషకాల లోపం వస్తుందని తెలిపారు. నివారణకు పొటాషియం నైట్రేట్ 20 గ్రాములు, 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ ఒక లీటరు నీటిలో కలిపి వారానికోసారి చొప్పున మూడు సార్లు పిచికారి చేసుకోవాలన్నారు. ఆముదం పంటలో కంకిపై బూజు తెగులు గమనిస్తే ఒక లీటరు నీటిలో 2 గ్రాముల కార్బండిజం లేదా 2 గ్రాముల టెబుకనజోల్ పిచికారి చేసుకోవాలని సూచించారు.

నానో యూరియాపై అవగాహన అవసరం

- జెడిఎ పిఎల్ వరలక్ష్మి

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలో రైతులు నానో యూరియాపై అవగాహన పెంచుకోవాలని, డిఎపి నానో యూరియా పంటలకు వాడుకోవాలని జెడిఎ పిఎల్.వరలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలో యూరియా డిస్ట్రిబ్యూషన్‌కు సంబంధించి ఆర్ఎస్‌ఎలలో, ప్రయివేట్ డీలర్ల వద్ద ఏవిధంగా జరుగుతుందో తెలుసుకోవడానికి కౌతాళం ఆర్ఎస్‌కె-1ను సందర్శించారు. ప్రయివేట్ డీలర్ల వద్ద రాజభక్ సీడ్స్, నాగేంద్రప్ప అండ్ సన్స్ షాపులను తనిఖీ చేసి తదుపరి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి రైతూ యూరియా కోసం పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డు తీసుకుని పాసు పుస్తకంలో ఎంట్రీ చేయించుకుంటే ఒక రైతు మూడు బస్తాల వరకు తీసుకెళ్లాలని తెలిపారు. ఎఒ శేషాద్రి పాల్గొన్నారు.

ఆదోనిరూరల్ : మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని జెడిఎ పిఎల్.వరలక్ష్మి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉండి వారికి సూచనలు, సలహాలు అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలోని పత్తి పొలాలను సందర్శించి, అధిక వర్షాల నేపథ్యంలో రైతులకు జాగ్రత్తలు, పత్తి పంట యాజమాన్య పద్ధతులపై సూచనలు ఇచ్చారు.

యూరియా కొరత రానివ్వొద్దు : ఆదిశేషరెడ్డి

మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి 50 టన్నుల యూరియా అవసరం ఉన్నప్పటికీ 280 బస్తాలు ఏ మూలకూ సరిపోవని, అడిగిన ప్రతి రైతుకూ యూరియా అందించాలని ఆంధ్రప్రగతి ఫార్మర్స్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ ఆదిశేషరెడ్డి కోరారు. స్పందించిన అధికారులు త్వరలో ప్రతి రైతుకూ యూరియా అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఆదోని ఎడిఎ బి.బాలవర్ధిరాజు, కర్నూలు టెక్నికల్ వ్యవసాయ అధికారి రాఘవేంద్ర, ఆదోని ఎఒ బివిజి.సుధాకర్, వ్యవసాయ విస్తరణాధికారి పి.సతీష్, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాస నాయక్, సాంబశివుడు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : పంట ముంపునకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ శివశంకర్ పేర్కొన్నారు. కలుగొట్ల గ్రామంలో పంట పొలాలను సందర్శించారు.

'ఎస్సీ కాలనీలో వసతులు కల్పించాలి'

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఎరిగేరి గ్రామంలో ఆర్‌డిటి స్వచ్ఛంద సంస్థ నిర్మించిన ఎస్సీ కాలనీలో వసతులు కల్పించాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న, గ్రామ నాయకులు వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎరిగేరి ఆర్‌డిటి కాలనీ వాసులు ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాలకు తరలివచ్చి సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్‌డిటి కాలనీలో మోకాళ్ల లోతు నీళ్లు ప్రవహిస్తున్నాయని, పాములు, జలగలతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు వచ్చి చూడాలని, లేకపోతే ఇక్కడే నివాసం ఉంటామని, ఇక్కడే వంటలు చేసుకుంటామని కాలనీవాసులు ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 2 గంటల పాటు ఎంపిడిఒ కార్యాలంలో బెడ్ షీట్లతో అక్కడే కూర్చుని గేటు మూసి నిరసన చేపట్టారు. కాలనీని సందర్శించి, మురుగునీటిని తొలగించి గరుసు వేస్తానని ఎంపిడిఒ హామీఇవ్వడంతో ధర్నాను విరమించారు. సర్పంచి గోవిందు, సిపిఎం కార్యకర్తలు చిన్న వీరేష్, రాజు, దుర్గప్ప, రేణుకమ్మ, మరియమ్మ, నరసమ్మ, చిట్టెమ్మ, కిట్టు, యువరాజు, మహాదేవ పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం తగదు

- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య


ప్రజాశక్తి -కౌతాళం

మండలంలోని రైతులకు ఎరువులు అందించడంలో వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం తగదని, సుమారు 2 వేల టన్నుల యూరియాను సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వర్షాలు ముందుగా కురవడంతో మండలంలో 25 వేల హెక్టార్లలో రైతులు వివిధ పంటలను సాగు చేశారని తెలిపారు. అధికారులు కాంప్లెక్స్ ఎరువులు, యూరియా తగినంత తెప్పించడంలో విఫలమయ్యారన్నారు. ఎరువు దుకాణాల యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తూ, యూరియా తీసుకుంటే బదులు ఇతర ఎరువులు కూడా తీసుకోవాలని నిబంధనలు పెడుతూ, ఎక్కువ ధరలకు యూరియా అమ్ముతున్నారని చెప్పారు. యూరియా వచ్చినా వ్యవసాయ అధికారులు రైతులకు సమానంగా ఇవ్వకుండా పలుకుబడి ఉన్న వారికి, రాజకీయ నాయకులకు ఇస్తున్నారని విమర్శించారు. చిన్న, సన్న కారు రైతులకు యూరియా అందడం లేదని తెలిపారు. కూటమి నాయకులు స్పందించి మండలానికి 2 వేల టన్నుల యూరియా తెప్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం తహశీల్దార్ రజనీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి బి.ఈరన్న, నాయకులు చిన్న రామలింగ, తోవి వీరేష్, వెంకటేష్, బుడదొడ్డి, ఈరన్న పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కౌతాళం

బదినేహాల్ గ్రామంలో కీర్తిశేషులు బిడి.అత్రి గౌడ్ తనయుడు కార్తీక్ గౌడ్ పుట్టినరోజు వేడుకలను అత్రి గౌడ్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. యూత్ నాయకులు మాట్లాడుతూ... కార్తీక్ గౌడ్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, అలాగే ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ఉండాలని ఆకాంక్షించారు. అత్రి గౌడ్ యూత్ సభ్యులు వెంకటేష్, మల్లయ్య, రాఘవయ్య, తోవి రవి, వీరేష్, ఖాదర్ పాల్గొన్నారు.



కేక్ తినిపిస్తున్న యూత్ సభ్యులు

నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం

తుంగభద్ర నదీతీరంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ డ్యాం నుంచి తుంగభద్ర నది దిగువకు లక్షన్నర క్యూసెక్కుల నీరు విడుదలయిందని, నదిలోకి వెళ్లకూడదని తెలిపారు. పశువుల కాపరులు, చేపల వేటకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాగులు, వంకలు ప్రవహించే సమయంలో వాగు దాటేందుకు ప్రయత్నం చేయకూడదన్నారు. అధికారులతో మాట్లాడి జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కోరారు.



సబ్ కలెక్టర్ కార్యక్రమం వద్ద ధర్నా చేపడుతున్న వికలాంగులు

క్షోభకు గురి చేయవద్దు

- సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు వికలాంగుల ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

అకారణంగా పింఛన్లను తొలగించి మానసిక, శారీరక ఇబ్బందులకు గురి చేయడం తగదంటూ వికలాంగులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వైసిపి వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు వాల్మీకి రామాంజనేయులు, వైసిపి మండల అధ్యక్షులు పి.హనుమంత రెడ్డి, విజేత మండల అధ్యక్షులు వై.దుగ్గప్ప, వీరాంజనేయులు మాట్లాడారు. వికలాంగులకు రూ.6 వేలకు పింఛను పెంచామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులకు తమ కష్టాలు తెలియకపోవడం దారుణమని విమర్శించారు. నిర్ధారణ చేసుకోవాలని చుట్టూ తిప్పడం సమంజసం కాదన్నారు. మానసిక స్థితి సరిగా లేక, కంటిచూపు లేని, కాళ్లు, చేతులు పని చేయలేని వారిని ఇబ్బందులు గురి చేయడం తగదని తెలిపారు. పింఛన్లను క్రమబద్ధకరించి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు రీ అసెస్‌మెంట్ క్యాంపులో పింఛన్లు తొలగించడం దారుణమన్నారు.

మధ్యాహ్నమైనా తెరచుకోని సచివాలయం

- సిపిఎం నాయకులు దేవపుత్ర

- అధికారుల కోసం రైతుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - నందవరం

గురజాల గ్రామ సచివాలయాన్ని మధ్యాహ్నమైనా అధికారులు తెరవడం లేదని సిపిఎం నాయకులు దేవపుత్ర తెలిపారు. మధ్యాహ్నం 1 గంటయినా సచివాలయానికి అధికారులు రాకపోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ఉదయం 9 గంటల నుంచి సచివాలయం దగ్గర పడిగాపులు కాస్తున్నామని ప్రజలు తెలిపారు. తమ పింఛన్లను తొలగించారని వాటి వివరాలను కనుక్కోవడానికి వచ్చామని కొందరు చెప్పారు. తమ అవసరాల నిమిత్తం వచ్చామని మరికొంతమంది వివరించారు. అధికారులు రాకపోవడంతో ప్రజలు సత్యమయ్య, రామకృష్ణ, దస్తగిరి, సుజ్ఞానం, సుధాకర్, అగ్రిఫ్, బోయ దస్తగిరి సోమవారం తాళమేసి ఉన్న తలుపులకు దరఖాస్తులను చూపించారు. సమయ పాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పొంతన లేని సమాధానాలు : అధికారులను వివరణ కోరగా పొంతన లేని సమాధానం చెప్పారు. అక్కడ సచివాలయం ఉదయం నుంచే తెరచి ఉందని సమాధానమిచ్చారు. సచివాలయానికి తాళం ఒకటే ఉంది. అది అగ్రికల్చర్ ఆఫీసర్ దగ్గర ఉంది. ఆయన వేరే ఊరు నుంచి రావాలి. వచ్చే సందర్భంలో వాగు ఉండడం వల్ల ఆయన అక్కడే నిలిచిపోయారు. సచివాలయం తెరవడం ఆలస్యం అయిందని పొంతన లేని సమాధానాన్ని సచివాలయ అధికారి చెప్పారు. మండల అధికారి జోక్యం చేసుకొని తాళం పగులగొట్టి సచివాలయం తెరవాలని ఆదేశాలు జారీ చేయగా అప్పుడు సిబ్బంది హుటాహుటిన తెరిచారు. సచివాలయం తెరిచారా.. లేదా అన్న విషయం కూడా పంచాయతీ అధికారికి తెలియకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. సమస్యలపై వారి పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు, రైతులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం



నివాళులర్పిస్తున్న ప్రదీప్ రెడ్డి

వైసిపి జెసిఎస్ టౌన్ కన్వీనర్, మృతుడు మంగళి రామకృష్ణ కుటుంబానికి వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక రామచంద్ర నగర్ కాలనీకి చెందిన రామకృష్ణ ఏడాదిగా అనారోగ్యంతో బాధ పడుతూ సోమవారం మృతి చెందారు. విషయాన్ని సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ప్రదీప్ రెడ్డి సర్పంచితో కలిసి రామకృష్ణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.10 వేల నగదును తక్షణ సహాయం కింద అందజేశారు.